క్లుప్తంగా

బాబూ రాజేంద్రప్రసాద్‌కు ఘన నివాళి



బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు

కురిచేడు: స్వాతంత్య్ర సమరయోధుడు బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా గ్రంథాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీ, గ్రంథపాలకురాలు సుమతిలు రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ షేక్ షబనా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొప్పాయి పంటలో ఆకుమచ్చ తెగులు

యర్రగొండపాలెం: బొప్పాయి పంటలో ఆకు మచ్చ తెగులు సోకి కింది ఆకులు పండుబారి రాలిపోతున్నాయని, రైతులు వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టి తమ పంటలను కాపాడుకోవాలని ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గంజివారిపల్లె, వెంకటాద్రిపాలెం గ్రామాల్లో ఆయనతో పాటు ఏవో కేవీ శేషారెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వారు బొప్పాయి, కంది, మినుము, మిరప పంటలు పరిశీలించారు. హెచ్‌వో మాట్లాడుతూ బొప్పాయి పంటకు సోకిన ఆకు మచ్చ తెగులు నివారణకు ప్రాపికోనజోల్ (టిల్ట్) ఎకరాకు 400 మిల్లీలీటర్లు, టేబుల్ కొనజోల్ (ఫాలిక్యూర్) 400 మిల్లీలీటర్లు, నాటివో 140 మిల్లీలీటర్లు వీటిలో ఏదో ఒక మందును స్ప్రే చేయాలని, 5 రోజుల వ్యవధిలో ఈ మందులు మార్చి పిచికారీ చేసుకోవాలని, పంటలో భాస్వరం ఉండే ఎరువులు వాడకూడదని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఎల్.మాల్యాద్రిరెడ్డి, డి.ధనేశ్వరనాయక్, వీఏఏలు డి.మీరావలి, ఎస్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యతకు తిలోదకాలు

- ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్న విద్యార్థులు
- అన్నం తింటే కడుపునొప్పి వస్తుందని భయపడుతున్న విద్యార్థులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంచి ఆహారం అందిందంటున్న విద్యార్థులు

తాళ్లూరు:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశంసల జల్లు కురిపించారు. అందులో భాగంగా జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రవేశ పెట్టి విద్యార్థులకు కొత్త మెనూ తీసుకొచ్చి పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించడంలో వందకి వంద శాతం అప్పటి పాలకులు విజయం సాధించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జగనన్న గోరుముద్దగా పిలువబడే మధ్యాహ్న భోజన పథకం పేరు మార్చి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా మార్చారు. గత ప్రభుత్వం అమలు చేసిన మెనూ కొనసాగించినప్పటికీ విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోంది. చాలా మంది విద్యార్థులు ఇంటి వద్ద నుంచి క్యారేజీల ద్వారా పాఠశాలకు భోజనం తెచ్చుకుని తింటున్నారు. అన్నం ముద్దగా ఉండటంతో పాటు గుడ్లు సరిగా ఉడక్కపోవడంతో కడుపు నొప్పి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. మండలంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాల నుంచి విద్యార్థులు జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకుంటున్నారు. వీరంతా తప్పకే పాఠశాలల్లో పెట్టే భోజనమే తప్పక తినేవారు. ఇళ్ల నుంచి వచ్చే విద్యార్థులు పాఠశాలల్లో పెట్టే భోజనం తినలేక ఇళ్ల వద్ద నుంచి క్యారేజీలు తెచ్చుకుని తింటున్నారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల దుస్థితి ఇలాగే ఉంటోందని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్నతో పాటు ఎంఆర్‌ఓ సంజీవరావులు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు పలు సూచనలు చేసినా వారిలో మార్పు రావడం లేదు.



ప్రభుత్వ పాఠశాలకు క్యారేజీ తీసుకెళ్తున్న మూడో తరగతి విద్యార్థి



ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని పాఠశాలలో తింటున్న విద్యార్థినులు

వాతావరణ హెచ్చరికలు పాటించాలి

దొనకొండ: రైతులు వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పని సరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం తెల్లబాడు, ఆరవల్లిపాడు గ్రామాల రైతులతో మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో కొద్దిమేర పంటలు ఇబ్బందికరంగా ఉంటాయని, ప్రతి రోజూ జాగ్రత్తగా పరిశీలించుకోవాలన్నారు. మరి ముఖ్యంగా మిరపలో వాతావరణం దృష్ట్యా పురుగు సోకుతుందని, జాగ్రత్తగా క్రిమిసంహారక మందు పిచికారీ చేయాలని ఏఓ తెలిపారు. ఆయన వెంట మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది ధనరాజ్, రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: రబీలో సాగు చేసిన ప్రతి పంటకు ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలని వ్యవసాయాధికారి కె. బుజ్జిబాయి అన్నారు. మండల పరిధిలోని కంభంపాడు, తంగిరాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంటల బీమా, పంట నష్టపరిహారం, సున్నా వడ్డీ పంట రుణాలు, కనీస మద్దతు ధరలకు పంటల విక్రయం తదితర పథకాలు అందాలంటే తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద వివిధ రకాల పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం రైతు వాటా చెల్లించాలని, ఇన్సూరెన్స్ చెల్లించే పంటలకు కచ్చితంగా ఈ క్రాప్ బుకింగ్ చేసి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్ కట్టుకున్న విస్తీర్ణానికి, ఈ–క్రాప్ బుకింగ్ విస్తీర్ణానికి తేడా ఉంటే కంప్యూటర్ రిజెక్ట్ చేస్తుందన్నారు. పంటలు ఈ– క్రాప్ బుకింగ్ చేసేటప్పుడు తప్పులు, అవకతవకలు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి చెప్పారు.



పెద్దారవీడు: మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

విద్యార్థులకు కంటి పరీక్షలు

కురిచేడు: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆదేశాల మేరకు మండలంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు చేశారు. ఆప్తాల్మిక్ అధికారులు బీజేఎస్ హెరాల్డ్, ఏ.గురుస్వామిలు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మండలంలోని పడమరవీరాయపాలెం, వెంగాయపాలెం, పొట్లపాడు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం నేత్రవ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కలిగించారు. ఆయా పాఠశాలల ప్రధ్యానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీహెచ్ఓ సౌభాగ్యమ్మ, ఏఎన్ఎం బాలమరియమ్మ, ఆశా కార్యకర్త నాగేంద్రం, అవినాష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ అధికారులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

త్రిపురాంతకం: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శివబసవరాజు హెచ్చరించారు. మండలంలోని గొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద సైబర్ నేరాలపై విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. విద్యార్థులు మంచి చదువులు చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో మంది ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ శాఖల్లో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వీలున్నంత తక్కువగా ఉండాలని, అవసరం లేని యాప్‌ల జోలికి వెళ్లరాదన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ వంటి వాటికి బానిసలు కావద్దని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శివబసవరాజు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



రోగులకు అందుతున్న సేవలు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ మజీదా బేగం



నర్సులు, వైద్య సిబ్బందితో మాట్లాడుతూ..

- డీసీహెచ్ఎస్ డాక్టర్ మజీదా బేగం

పెద్దదోర్నాల: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీసీహెచ్ఎస్ (డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పటల్ సర్వీసెస్) డాక్టర్ మజీదా బేగం వైద్యాధికారులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని 50 పడకల వైద్యశాలకు సంబంధించి, వైద్యాధికారులు, సిబ్బందిపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆమె విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తాను విచారణాధికారిగా వచ్చినట్లు తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రంపై వచ్చిన ఫిర్యాదులను ఆమె ప్రస్తావించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మహేశ్వరి విధులు నిర్వహిస్తున్న చోట కాకుండా ఇతర ప్రాంతంలో నివాసం ఉంటూ హెచ్‌ఆర్‌ఏ తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. దీంతో పాటు ఆమె వారానికి రెండు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. వైద్యశాలలోని పలువురు వైద్యులు సైతం ఇదే పద్ధతిని అవలంబిస్తున్నారని, వైద్యశాలకు సకాలంలో రాకుండా బయట సొంత వైద్యం చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వైద్యశాలలో 12 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా కేవలం ఐదుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎక్కువ మంది సిబ్బంది తమ ముఖ ముద్రలను ఎక్కడో వేసుకుంటున్నారన్న ఆరోపణలు వచ్చాయన్నారు. ఎక్కడెక్కడో ఉంటూ అలవెన్సులు పొందటం క్షమించరాని నేరమని హెచ్చరించారు. సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో వాటిని విచారించేందుకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ సిరి ఐఏఎస్ ఆదేశాలతో తాను వచ్చినట్లు ఆమె తెలిపారు. దీనికి సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. వైద్యశాలలోని పలు విభాగాలను ఆమె పరిశీలించారు. పోస్టుమార్టం గదితో పాటు ఎక్సరే ప్లాంటు ఏర్పాటుకు సహకరిస్తామని భరోసా ఇచ్చారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్వరి, ఇతర వైద్యాధికారులు, నర్సులు, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



దొనకొండ: దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు



పుల్లలచెరువు: దివ్యాంగులకు వస్తువులు పంపిణీ చేస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ ఇందిర అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఆమె ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వారిని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికే కానీ మనస్సుకు కాదని, వారిని ఎప్పుడూ చిన్న చూపు చూడరాదన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు అందించే అనేక పథకాలను సద్వినియోగం చేసుకుని అభ్యున్నతి సాధించాలని కోరారు. అనంతరం దివ్యాంగులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మండలంలోని పలు గ్రామాల దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు తేజరూపిని, ఉపాధ్యాయులు సాల్మన్, కోటేశ్వరరావు, సిబ్బంది సత్యనారాయణ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): సమగ్ర శిక్ష ద్వారా అందిస్తున్న సౌకర్యాలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు సుబ్బారావు, వెంకటేశ్వర్లు కోరారు. భవిత కేంద్రం ఆధ్వర్యంలో ఎంపీపీఎస్ స్కూల్లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతులు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ భవిత కేంద్రంలో అందించే సేవలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అందిపుచ్చుకోవాలని కోరారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు కె.శారద, ఏడుకొండలు, వి.పవన్‌కుమార్, ఉపాధ్యాయులు షేక్ మస్తాన్‌వలి, లలిత, రిసోర్స్ పర్సన్‌లు ఎస్. కోటేశ్వరరావు, ఎం.నాగమణి పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక భవిత సెంటర్‌లో ప్రపంచ వికలాంగుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓలు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్‌బాషా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులను సమాజంలో చిన్న చూపు చూడవద్దని, అందరూ సమానమే అన్నారు. భవిత సెంటర్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, తల్లిదండ్రులు తప్పని సరిగా వికలాంగ విద్యార్థులను పంపించాలన్నారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం పల్లవి, ఉపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, ఎం.ఉషా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: అన్ని రంగాల్లో విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూనాయక్‌లు అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభ వంతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సమగ్ర శిక్ష ద్వారా అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, భవిత కేంద్రంలో జరిగే సేవలు విభిన్న ప్రతిభావంతుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వారికి భోజనాలు ఏర్పాటు చేసిన చిమట సాంబయ్య, దివ్యాంగుల సంఘం నాయకులు గుమ్మా రాజయ్య, చిన్నయ్యలను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం పిచ్చిరావు, ఉపాధ్యాయులు సాధిక్, చెన్నకేశవులు, సురేష్, అంకారావు, ఏఎంసీ చైర్మన్ ఖలీల్, మరియబాబు పాల్గొన్నారు.

దర్శి: దివ్యాంగులకు అండగా ఉండి వారికి అన్నీ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని మానవత సేవా సంస్థ అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు భోజనం బాక్సులు అందజేశారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధనిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మానవతా సంస్థ భవిత కేంద్రానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. విద్యార్థులకు ఎటువంటి అవసరాలు వచ్చినా తమ సంస్థ ద్వారా ఆదుకుంటామని చెప్పారు. దివ్యాంగులను చిన్న చూపు చూడకుండా ప్రేమతో ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. సంఘ సేవకుడు జీవీ రత్నం, మానవతా చైర్మన్ దేవతి వరప్రసాద్, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, సభ్యులు పాపసాని రాజకేశవరెడ్డి, అన్నవరపు వెంకటేశ్వర్లు, సుశీలమ్మ, విద్యాసాగర్ పాల్గొన్నారు.

పెద్దారవీడు: అంగవైకల్యం కలిగిన పిల్లలను సమాజంలో గౌరవించాలని ఎంఈఓ 1,2 పి.శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఎంపీపీ (డిపెప్) పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఎంఈఓలు మాట్లాడుతూ చిన్నారులకు తప్పనిసరిగా పోలీయో చుక్కలు వేయించాలని, ప్రతి గురువారం జరిగే ఫిజియో థెరపీ శిబిరానికి చిన్నారులను కచ్చితంగా తీసుకురావాలని సూచించారు. భగవంతుడు ఇచ్చిన సృష్టిలో అత్యంత బహుమతి జీవితమన్నారు. సమాజం ఆదరిస్తే విభిన్న ప్రతిభావంతులు మేధావులేనని, సాధారణ వారి కంటే మేథో సంపతి ఎక్కువగా ఉంటుందన్నారు. జన్యుపరంగా అందరూ శక్తి వంతులేనని, వారి వాతావరణ, పరిసరాల ప్రభావంతో వారి అంతరంగంలో మార్పు తీసుకురావచ్చన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం ఎస్‌వీ పద్మలత, ఐఈఆర్టీలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో విజయం సాధ్యం

దర్శి: ఆత్మ విశ్వాసంతో విజయం సాధ్యం అవుతుందని ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో అంతర్జాతీయ విభిన్న ప్రతివంతుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. నెల్లూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా దివ్యాంగ విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంఈఓలు మాట్లాడుతూ ఆత్మ విశ్వాసంతో అంగవైకల్యాన్ని జయించవచ్చన్నారు. దివ్యాంగులను విద్యాలయాల్లో అందరితో సమానంగా చూడాలని సూచించారు. దివ్యాంగులకు ఎటువంటి సాయం కావాలన్నా నేరుగా తమను సంప్రదించాలని కోరారు. సంఘ సేవకుడు జీవీ రత్నం మాట్లాడుతూ దివ్యాంగుల విజయగాథల గురించి వివరించారు. దివ్యాంగులు ఎందులోనూ తక్కువ కాదన్నారు. వారిలో ఆలోచనా శక్తికి పదును పెడితే సామాన్యులకంటే ఉన్నతంగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గోపాలుని సుబ్రహ్మణ్యం, మందపల్లి శ్రీనివాసులు, బి.లీలావతి, పి.ఓబయ్య, సాయి అవినాష్, వెంకట్రావు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: వివాహ వ్యవస్థలో మేనరికాలతో పుట్టే చిన్నారులకు శారీరక, మానసిక వైకల్యాలు సంభవించే ప్రమాదం ఉందని ఎంఈఓ మస్తాన్ నాయక్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఫాదర్ ఫెర్రర్ ఆడిటోరియంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టవిరుద్ధమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, వైద్యశాల సూపరింటెండెంట్ నాగమహేశ్వరి, ఏరియా టీం లీడర్ వేమయ్య, సత్తెన్న పాల్గొని వికలాంగ చిన్నారులకు ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్ పంపిణీ చేశారు.



విభిన్న ప్రతిభావంతులతో ఎంఈవోలు, ఉపాధ్యాయులు



దర్శి: విద్యార్థులకు భోజనం బాక్సులు అందజేస్తున్న మానవత సభ్యులు



పెద్దారవీడు: బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం

నేడు ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఈ సందర్భంగా త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో జరిగే వివిధ శుభ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు



సారాబట్టీని ధ్వంసం చేస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు

పుల్లలచెరువు: గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాలపై మండలంలోని చిన్న పీఆర్‌సీ తండా పరిధిలో మంగళవారం దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో 175 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా తయారు చేసినట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

నేరాల సంఖ్య తగ్గుముఖం

- డీఎస్పీ నాగరాజు

పెద్దదోర్నాల: మండలంలో ప్రస్తుతం నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని మార్కాపురం డీఎస్పీ నాగరాజు అన్నారు. మండల కేంద్రం పెద్దదోర్నాల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ట్రాఫిక్ సమస్యపై కూడా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సీఐ ప్రభాకర్‌రావు, ఎస్సై మహేష్ చొరవతో మండల కేంద్రంలో 22 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీంతో పాటు మిస్సింగ్ కేసులను త్వరితగతిన ఛేదించగలిగామని పేర్కొన్నారు. దాదాపుగా అన్ని కేసులను ఛేదించినట్లు వివరించారు. దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యాక్సిడెంట్ కేసుల్లో ఎక్కువ శాతం హెల్మెట్‌లు వాడకుండా ప్రమాదాలకు గురవుతున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపి వారి జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. పోలీసుస్టేషన్‌లోని రికార్డులు తనిఖీలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సీఐ ప్రభాకరరావు, ఎస్సై మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

పార్టీ సంస్థాగత నిర్మాణానికి సన్నద్ధులు కావాలి

కురిచేడు: పార్టీ సంస్థాగత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి కేపు కృష్ణారెడ్డి సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. నెల వ్యవధిలో మండల పార్టీ కమిటీలు వేయాలని ఆదేశించారు. ఈ నెల 20వ తేదీ లోపల పార్టీ కార్యకర్తల వివరాలు సేకరించాలన్నారు. అన్ని అనుబంధ సంఘాలకు నాయకులను నియమించాలన్నారు. గత ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ గురించి గ్రామ స్థాయి వరకు తెలియజేయాలన్నారు. షేక్ మీరావలి, కాటం వెంకట రమణారెడ్డి, ముల్లా ఖాదర్ బాషా, శ్రీను, బాబు, ప్రసాద్, ఇమ్మానియేలు, ప్రతాప్‌రెడ్డి, అహ్మదుల్లా, సుభానీ, పాపారావు పాల్గొన్నారు.

పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు విజయవంతం చేయాలి



హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, హెచ్‌ఎంలు

త్రిపురాంతకం: మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం ఈ నెల 7న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో నిర్ణయించిన మేరకు ప్రతి పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం జరగాలన్నారు. అపార్‌లో వెనకపడకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను ఆవిష్కరించారు. ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.